

ఎల్లార్తి ఉరుసు ప్రారంభం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి ఉరుసు ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే ఈ వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 8లో▸



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,632.00
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 11,051
అవుట్ ఫ్లో	: 10,571

న్యూస్‌రీల్

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



దాతకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఎం.శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా రూ.1,01,016 విరాళాన్ని పర్యవేక్షకులు మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. విరాళాన్ని అందించిన దాతకు దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

3 నుంచి దసరా ఉత్సవాలు



బేతంచెర్లలో విద్యుత్ దీపాల అలంకరణలో స్వామి, అమ్మవార్ల హోర్డింగ్

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 12 వ తేది వరకు దసరా నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. మహాలక్ష్మి అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. 3న శ్రీ కాత్యాయణి, 4న బాల త్రిపుర సుందరి, 5 గాయత్రి, 6 అన్నపూర్ణేశ్వరి, 7న లలితా త్రిపుర సుందరి , 8న మహాలక్ష్మీ, 9 సరస్వతి, 10 న దుర్గాదేవి, 11 మహిసాసుర మర్దిని, 12న రాజ రాజేశ్వరీ దేవి అలంకారం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దసరా నవరాత్రోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కాగా ఉత్సవాల సందర్భంగా ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్ల పట్టణంలో విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి హోర్డింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

శ్రీశైలంలో 189 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 189.0148 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 880.20 అడుగులకు చేరుకుంది. జూరాల, సుంకేసుల నుంచి 76,027 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. శనివారం నుంచి ఆదివారం వరకు ఎగువ ప్రాజెక్టుల నుంచి 1,21,195 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. శ్రీశైలం నుంచి దిగువ ప్రాజెక్టులకు 61,323 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 6.103 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 15.561 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

తెలుగుగంగకు 10 వేల క్యూసెక్కుల నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి తెలుగుగంగ (వీబీఆర్) కాల్వకు 10వేల క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేస్తున్నట్లు జేఈ దేవేంద్ర తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి 13,000 క్యూసెక్కుల నీరు బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు వచ్చి చేరుతుందన్నారు. కాగా కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 3,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. జీఎన్ఎస్ఎస్ గేట్లు మూసి నీటి విడుదలను నిలిపివేసినట్లు జేఈ వెల్లడించారు.

కష్టం తడిచి.. నష్టం మిగిలి

- మొక్క జొన్న రైతు కుదేలు
- భారీ వర్షాలతో ఆశలు గల్లంతు
- కోత దశలో తడిచిన దిగుబడి
- మార్కెట్‌లో తగ్గిన ధర

కోటి ఆశలతో మొక్కజొన్న సాగు చేసిన రైతులకు చివరకు కడగండ్లు మిగిలాయి. పంట పెరిగే దశలో వానలు లేకపోవడం, అరకొరగా పండిన పంట కోతల సమయంలో వరుణుడు ఎడతెరిపి ఇవ్వకపోవడంతో భారీ నష్టం వాటిల్లింది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో మొక్కజొన్న రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. ఓ వైపు వానలకు దిగుబడి తడవటం.. మరో వైపు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రంగు మారిన దిగుబడిని ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



ఆత్మకూరు సమీపంలో వర్షపు నీటిలో మొక్కజొన్న దిగుబడులు

ఆత్మకూరు: జిల్లాలో మొక్కజొన్నను ఆత్మకూరు సబ్ డివిజన్‌లోనే అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో భారీ వర్షాలు కురవడంతో రైతుల ఆశలు నీట మునిగాయి. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 45 వేల హెక్టార్లు కాగా రైతులు ఆసక్తి చూపడంతో ఈ ఏడాది 50 వేల హెక్టార్లలో పైగా సాగైంది. ఆత్మకూరు డివిజన్‌లోనే 15 వేల హెక్టార్లలో సాగు చేశారు. మొదట తొలకరి వానలకు విత్తనం వేసిన తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో పలు మండలాల్లో రైతులు పంటను దున్నేసి మళ్లీ విత్తనం వేశారు. అయితే ఆ తర్వాత వానలు సమృద్ధిగా కురిసి పంటలు కళకళలాడాయి. లాభాలు మూటగట్టుకోవచ్చని భావించిన రైతుల ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. పంట కోత దశకు వచ్చి, నూర్పిళ్ల మొదలయ్యే సమయానికి ఎడతెరిపి ఇవ్వకుండా భారీ వర్షాలు కురిశాయి. దీంతో దిగుబడి మొత్తం తడిచిపోయింది. కోతలకు వీలు లేకుండా పొలాల్లో నీరు నిలిచిపోవడంతో వానలకు కండెలు తడిచి మొలకెత్తిన దృశ్యాలు కనిపించాయి.



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వర్షపు నీటితో నిండిన మొక్కజొన్న పైరు

కొన్ని చోట్ల కల్లాల్లో ఆరబోసిన దిగుబడి నీట తడిచి రంగు మారింది. తుపాన్ ప్రభావంతో జిల్లాలో ఆగస్టు నెలాఖరులో వరుసగా మూడు రోజుల పాటు భారీ వానలు కురిశాయి. ఈ వానలకు జిల్లాలో 7 వేల హెక్టార్లలో మొక్కజొన్న దెబ్బతినగా.. ఆత్మకూరు సబ్ డివిజన్‌లో 6 వేల హెక్టార్లలో పంట తిన్నట్లు అధికారులు తేల్చారు. ఆత్మకూరు, పాములపాడు, వెలుగోడు, కొత్తపల్లి మండలాల్లో రైతులు భారీగా నష్టపోయారు. ఆగస్టు చివరి వారం , సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన వానలకు మొక్కజొన్న రైతులు కుదేలయ్యారు. అధికారులు ప్రాథమిక అంచనా వేసి పరిహారం ఇచ్చేందుకు నివేదిక సమర్పించారు.

దిగుబడి తగ్గి.. ధర పడిపోయి..

సాధారణంగా ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా భారీ వర్షాలతో ఈ ఏడాది 8 నుంచి 12 క్వింటాళ్లకే పరిమితం కావడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. రెండు సార్లు విత్తనాలు వేయాల్సి రావడంతో ఎకరాకు రూ.25 నుంచి రూ.40 వేల దాకా పెట్టుబడి పెట్టారు. మరో వైపు చీడపీడల నివారణకు పురుగు మందులు, ఎరువులు వేయాల్సి వచ్చింది. భారీ వర్షాలతో దిగుబడి తగ్గడం అదే క్రమంలో ధర పడిపోవడంతో దిక్కుతోచడం లేదు. సాగు చేసే సమయంలో మొక్కజొన్న క్వింటం రూ.2,900 నుంచి రూ.3,100 పలికింది. ప్రస్తుతం రూ.1,800 నుంచి రూ.2 వేలు లోపే ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు వానకు తడిచి రంగు మారిన దిగుబడిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. అరకొరగా ఉన్న దిగుబడిని సైతం మంచి ధరకు అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. ఇక కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కౌలు చెల్లించలేని పరిస్థితి ఎదురైంది.



రైతులు ఆరబోసిన మొక్కజొన్న

పెట్టుబడి కూడా రాలేదు



నేను పది ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. మొదట వానలు లేకపోవడంతో పంట దున్నేసి మళ్లీ విత్తనం వేశాం. పంట చేతికొచ్చే సమయంలో వాన దేవుడు ముంచేశాడు. కోత కోసి కల్లంలో ఆరబోసిన మొక్కజొన్న మొత్తం తడిచిపోయింది. రంగు మారడంతో కొనేవారు ఎవరూ లేరు. పెట్టుబడి కూడా రాలేదు. ఈ ఏడాది మొక్కజొన్న రైతుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. – రవికుమార్, కరివేన గ్రామం

ప్రభుత్వం ఆదుకోవాలి



నష్టపోయిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల దాకా నష్టపరిహారం చెల్లించాలి. దాదాపు 15 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేశా. కనీసం కౌలుకు కూడా రాని పరిస్థితి. అధిక వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గింది. ఇప్పుడే మార్కెట్‌లో ధర పడిపోవడం దారుణం. – వెంకటయ్య, కరివేన గ్రామం

తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



తడిచిన మొక్కజొన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. దళారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. దిగుబడి తగ్గడం, ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. నేను 15 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశా. ఇప్పుడు కౌలు ఎలా చెల్లించాలో తెలియడం లేదు. – పింజారి మౌలాలి, కరివేన గ్రామం

పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలి



వాహనదారులకు హెల్మెట్ అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు, చిత్రంలో జిల్లా జడ్జి జి.కబర్ధి, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందుమాధవ్

- హైకోర్టు జడ్జి డాక్టర్ జస్టిస్ మన్మథరావు

కర్నూలు(లీగల్): ఉమ్మడి జిల్లాలోని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి డాక్టర్ జస్టిస్ మన్మథరావు జిల్లా న్యాయాధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కోర్టులో జిల్లా జడ్జి జి.కబర్ధి అధ్యక్షతన ఉమ్మడి జిల్లాల న్యాయాధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావు హాజరై కోర్టుల వారీగా పెండింగ్ కేసులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పెండింగ్ కేసులపై హైకోర్టు మార్గదర్శకాలు అనుసరిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లలో అధిక శాతం కేసులను రాజీ చేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు జి.ప్రతిభాదేవి, పి.పాండురంగారెడ్డి, జి.భూపాల్‌రెడ్డి, పీజే సుధామురళీ, వాసు, సీనియర్ సివిల్ జడ్జీలు టి.మల్లీశ్వరి, పి.దివాకర్, జీఎల్‌వీ శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జీలు జ్యోష్నాదేవి, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా హెల్మెట్ ధరించండి

సామాజిక బాధ్యతగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియా జడ్జి జస్టిస్ కె. మన్మథరావు అన్నారు. ఆదివారం ఉదయం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసాధికార సంస్థ కార్యాలయంలో వాహనదారులకు హైకోర్టు న్యాయమూర్తి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో ప్రమాద సమయాల్లో ప్రాణాలు కాపాడుకోవచ్చునన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ వినియోగంలో నిర్లక్ష్యం వీడాలన్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందుమాధవ్ మాట్లడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించి ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు.

ఎక్సైజ్‌లో ఎట్టకేలకు సీఐల బదిలీలు

కర్నూలు: ఎక్సైజ్ శాఖ నాలుగో జోన్ పరిధిలో సీఐల నియామకానికి సంబంధించిన బదిలీల జాబితా ఎట్టకేలకు వెలువడింది. రెండు వారాల ప్రతిష్టంభన తరువాత వివిధ విభాగాల్లో పని చేస్తున్న 143 మందికి స్థాన చలనం కల్పిస్తూ ఆ శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్లు, చెక్‌పోస్టులకు విజిలెన్స్ విభాగాలకు సీఐలను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

39 మంది ఎస్ఐలకు స్థాన చలనం

ఉమ్మడి కర్నూలు జిల్లా ఎక్సైజ్ శాఖలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న 39 మంది ఎస్ఐలకు స్థాన చలనం కలిగింది. ఈ మేరకు ఆ శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 14 ఎక్సైజ్ స్టేషన్లతో పాటు ఏపీఎస్‌డీసీఎల్, ఐఎంఎల్ డిపో, చెక్‌పోస్టులు, డీటీఎఫ్, బీఎంపీపీ, ఏసీ విజిలెన్స్ విభాగాల్లో పనిచేస్తున్న ఎస్ఐలకు మరో ప్రాంతానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. చాలా మంది ఎస్ఐలు ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలతో పాటు నేరుగా ఫోన్లు చేయించి కోరుకున్న స్థానాలకు పోస్టింగ్‌ల కోసం పట్టుబట్టడంతో బదిలీల వ్యవహారం డిప్యూటీ కమిషనర్‌కు తలనొప్పిగా మారింది. కూటమి ప్రభుత్వం అక్టోబర్ మొదటి వారం నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేస్తుండడంతో అధికార పార్టీ నేతలు దుకాణాలు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. మద్యం వ్యాపారం సానుకూలంగా సాగాలంటే సహకరించే అధికారులు, సిబ్బంది ఉంటేనే సాధ్యమనే యోచనతో అనుకూలమైన ఎస్ఐలను తమ ప్రాంతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. అధిక ఆదాయం వచ్చే స్టేషన్‌లో పోస్టింగ్‌ల కోసం ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధుల అనునాయులకు మామూళ్లు ముట్టజెప్పి, సిఫారసు లేఖల ద్వారా ఎస్ఐలు ఆ శాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి పోస్టింగులు దక్కించుకున్నట్లు అధికారులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీఐల బదిలీలు ఇలా..

స్టేషన్	సీఐ పేరు
కర్నూలు	చంద్రహాస్
ఆలూరు	లలితా దేవి
ఆదోని	జాన్ సైదులు
పత్తికొండ	విశ్వేశ్వరరావు
ఎమ్మిగనూరు	రమేష్ రెడ్డి
కోడుమూరు	మంజుల
కోసిగి	భార్గవ రెడ్డి
నంద్యాల	జి. కృష్ణమూర్తి
ఆళ్లగడ్డ	ఎమ్.కృష్ణమూర్తి
కోవెలకుంట్ల	ఎండీ తకీబాషా
బనగానపల్లె	వర్ధనా దేవి
డోన్	వరలక్ష్మి
ఆత్మకూరు	కిషోర్‌కుమార్
నందికొట్కూరు	రామాంజనేయులు
టాస్క్‌ఫోర్స్	
కర్నూలు	రాజేంద్ర ప్రసాద్
నంద్యాల	లక్ష్మీదాస్
ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్	
జయరాం నాయుడు, కృష్ణ, సుభాషిణి	
ఐఎమ్ఎల్ డిపో	
కర్నూలు	పద్మావతి
నంద్యాల	కోటిరెడ్డి నాగిరెడ్డి

మల్లన్నా.. బది‘లీలలు’ కనుమా!

- సాధారణ బదిలీలలో శ్రీశైలంపై శీతకన్ను
- బదిలీ 22 మంది.. వచ్చింది నలుగురే
- దేవస్థానంలో కొరవడిన పర్యవేక్షణ



శ్రీశైలంటెంపుల్: అతిపెద్ద పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారుల పాత్ర కీలకం. కాగా తక్కువ సిబ్బందితో రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీ మేరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కష్టసాధ్యమైంది. సాధారణ బదిలీల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలం క్షేత్రంపై దృష్టి సారించలేదని తెలుస్తోంది. ‘శ్రీశైల దేవస్థానాన్ని అభివృద్ధి చేసి, సకల సౌకర్యాలు, సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని ఇటీవల సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆయన చెప్పినట్లుగా బదిలీల విషయంలో జరగడం లేదు. సాధారణ బదిలీలలో భాగంగా శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న 22 మంది ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీలు చేస్తూ ప్రభుత్వం వారం క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఇతర దేవస్థానాల నుంచి నలుగురు ఉద్యోగులనే శ్రీశైలానికి బదిలీ చేసింది. రాష్ట్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం తరువాత అతిపెద్ద పుణ్యక్షేత్రాల్లో శ్రీశైల దేవస్థానం ఒకటి. శ్రీశైలాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతూ చిన్న చూపు చూస్తుంది. ప్రభుత్వం ఇటీవల సాధారణ బదిలీలు నిర్వహించింది. ఆ సమయంలో నిబంధనల మేరకు కొంత మంది ఉద్యోగుల పేర్లు మాత్రమే సూచించారు. అటు తరువాత కొందరు అధికారులు కూటమి ప్రభుత్వానికి కొన్ని పేర్లు ఇవ్వడంతో వారిని కక్షపూరితంగా బదిలీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీశైల దేవస్థానం నుంచి 22 మంది ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీ చేశారు. వీరి స్థానంలో ఇతర దేవస్థానాల నుంచి ఒక పర్యవేక్షకులు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు తప్ప ఎవరినీ కేటాయించ లేదు. దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు ఇద్దరు, నలుగురు సహాయ కార్యనిర్వహణాధికారులు ఇతర దేవస్థానాలకు బదిలీ అయ్యారు. ఇద్దరు ఇంజినీర్లు బదిలీ అయితే ఒక్క ఇంజినీర్‌ని మాత్రమే కేటాయించారు. క్షేత్రంలో అన్నదానం, వసతి, గోశాల, ఆలయం, పారిశుద్ధ్యం, రెవెన్యూ విభాగాలకు సహాయ కార్యనిర్వహణాధికారులు ఉంటారు. అయితే, క్షేత్రం నుంచి ఒకేసారి నలుగురు ఏఈఓలు బదిలీ కావడంతో ప్రస్తుతం ఒక్క పారిశుద్ధ్య విభాగానికి మాత్రమే ఏఈఓ ఉన్నారు. మిగిలిన నలుగురు ఇతర దేవస్థానాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఇతర దేవస్థానాల నుంచి శ్రీశైలానికి ఒక్క ఏఈఓని కూడా కేటాయించ లేదు.

సహాయ కమిషనర్‌కు అదనంగా మూడు విభాగాలు

సాధారణ బదిలీలలో శ్రీశైల దేవస్థానానికి దేవదాయశాఖ ఏఈఓలను కేటాయించకపోవడంతో దేవస్థానంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఆయా విభాగాల్లో పరిపాలన కుంటుపడకుండా ఉండాలంటే ఆయా విభాగాలను ఇతర అధికారులకు కేటాయించాలి. క్షేత్రంలో ఉన్న అధికారులకు అదనంగా పలు విభాగాలు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న సహాయ కమిషనర్‌కు ఆ పోస్టుతో పాటు రెవెన్యూ, అన్నదానం, ఆలయం మూడు విభాగాలు అదనంగా కేటాయించారు. అలాగే గోశాల శ్రీశైలప్రభ ఎడిటర్‌కు, దేవస్థాన వైద్యశాల పర్యవేక్షణ, మరి కొన్ని ఇతర విభాగాలను శ్రీశైల దేవస్థాన ప్రజాసంబంధాల అధికారికి కేటాయించారు.

ఆగని టీడీపీ ఆగడాలు

- గత ప్రభుత్వ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక శిలాఫలకాలపై అక్కసు
- అధికారం చేపట్టి వంద రోజులు దాటినా తగ్గని దాడులు
- తాజాగా అహోబిలంలో దేవాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన రహదారి శిలాఫలకం ధ్వంసం

ఆళ్లగడ్డ: ఎన్నికల్లో విజయం తర్వాత టీడీపీ శ్రేణుల్లో చెలరేగిన ఉన్మాదం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై దాడుల రూపంలో కొనసాగుతూనే ఉంది. గతంలో ఎన్న లేని విధంగా ఎన్నికల ఫలితాలు వెలువడ్డ వెంటనే మొదలైన దాడులు 100 రోజులు దాటినా తగ్గడం లేదు. దీన్ని అడ్డుకోవాల్సిన ప్రభుత్వం, పోలీసు శాఖ ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదు. దీంతో అధికార పార్టీ నేతలు నియోజకవర్గంలో రెచ్చిపోతున్నారు. ఆళ్లగడ్డ మండల పరిధిలోని ప్రముఖ అహోబిలం క్షేత్రంలో గత ప్రభుత్వ హయాంలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఎదురుగా భక్తులకు ఇబ్బంది లేకుండా రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. దీనిని నాడు స్థానిక ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో టీడీపీ కార్యకర్తలు ఆ సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శిలఫలకాన్ని ధ్వంసం చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డ రోజే అహోబిలం గ్రామ శివారులోని దొరకొట్టాల వద్ద ఓ శిలాఫలకాన్ని , నెల క్రితం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన ప్రధాన రహదారికి సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. తాజాగా ఇప్పుడు మరో శిలాఫలకం పగలగొట్టారు. ముందు ముందు మరెన్ని ధ్వంసం చేస్తారోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులను చూస్తూ ఓర్వలేకే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. చేతనైతే మీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేపట్టి ఇంతకంటే పెద్దగా శిలాఫలకాలు ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలి తప్ప ఇలాంటి చర్యలకు పాల్పడితే పచ్చని గ్రామాల్లో చిచ్చు పెట్టినట్లు అవుతుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



దేవాలయం ఎదురుగా సీసీ రోడ్డుకు సంబంధించిన శిలాఫలకం ధ్వంసం చేసిన దృశ్యం

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి మృతి


మస్తాన్‌వలి (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన వెల్దుర్తిలో ఆదివారం చోటు చేసుకుంది. పట్టణంలోని డోన్ రైల్వే గేట్ల సమీపంలో ఈద్గా వద్ద ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో కాచిగూడ నుంచి యశ్వంతపూర్ వెళుతున్న వందే భారత్ రైలు కింద మస్తాన్‌వలి (74) పడటంతో శరీరం ఛిద్రమైంది. విషయం తెలుసుకున్న కర్నూలు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మహబూబ్‌బాషా తెలిపారు. మృతుడు మస్తాన్‌వలి కృష్ణగిరి గ్రామ వాసి కాగా దాదాపు 150 ఆవులను మేపుకుంటూ వెల్దుర్తి మండలం బ్రహ్మగుండం సమీపంలో నివశిస్తున్నారు. మస్తాన్‌వలికి భార్య రమీజాబీతోపాటు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: పట్టణంలోని దేవనగర్‌కు చెందిన హుసేన్ (30) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఔట్ పోస్టు పోలీసుల సమాచారం మేరకు.. మృతుడు హుసేన్ రోజువారి కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులతో గొడవ పడి మనస్థాపంతో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంత సమయానికి గుర్తించిన కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

తమ్మడపల్లెలో రెండు బైకులు చోరీ

మహానంది: మండలంలోని తమ్మడపల్లెలో రెండు బైకులు చోరీకి గురయ్యాయి. సీతారామపురం గ్రామానికి చెందిన శివకుమార్ పని నిమిత్తం తమ్మడపల్లెకు వచ్చాడు. శనివారం రాత్రి అతని బైక్ చోరీ అయింది. అలాగే అదే గ్రామానికి చెందిన కేశాలు బైకు కూడా కనిపించకుండాపోయింది. ఈ రెండు ఘటనలపై మహానంది పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

12 మందికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

డోన్ రూరల్: మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామం వద్ద ఆదివారం రాత్రి బొలెరో వాహనం బోల్తా పడింది. 12మందికి గాయాలయ్యాయి. బేతంచెర్ల వద్ద రోడ్డు పనులు చేసి, తిరిగి డోన్‌కు వస్తుండగా ఎర్రగుంట్ల గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోగా ఈ ఘటన జరిగింది. గాయపడిన 12మంది కూలీలు రాజస్థాన్‌కు చెందిన వారు. వీరిని చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఐదుగురు కూలీలకు అస్వస్థత

రుద్రవరం: మండల పరిధిలోని ఎల్లావత్తుల గ్రామంలో పనికి వెళ్లిన ఐదుగురు కూలీలు అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో ఖరీఫ్ కింద వరిసాగు చేశారు. ఏపుగా పెరిగిన పైర్లలో తెగుల నివారణకు రైతులు మందులు చల్లుతున్నారు. ఆదివారం ఈ పనికి వెళ్లిన కూలీల్లో ఫర్, వెంకటరాముడు, కాశన్న, రత్నాలుతో పాటు మరొకరు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.


క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అతిథులు


ఫుట్‌బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

కర్నూలు (టౌన్): క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఉత్తమంగా రాణించాలని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు క్రీడాకారులకు సూచించారు. నగర శివారు లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాలలో ఆదివారం సీబీఎస్‌సీ క్లస్టర్-7 తెలుగు రాష్ట్రాల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అండర్ -14, అండర్-17, అండర్-19 బాలుర విభాగాల్లో 143 పాఠశాలల నుంచి 3500 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కర్నూలులో ఇంత పెద్ద టోర్నమెంట్ నిర్వహించడం ఇదే ప్రథమమన్నారు. తాను రవీంద్ర పాఠశాలలో చదువుకుని ఎంపీగా సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విద్యార్థులకు విద్య, క్రీడలు రెండు కళ్ల లాంటివని చెప్పారు. రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి.పుల్లయ్య మాట్లాడుతూ.. క్రీడలతో మంచి ఆరోగ్యం, క్రమశిక్షణ కలుగుతుందన్నారు. అలాగే సోదరభావం, స్నేహభావం పెరిగి వ్యక్తుల మధ్య బంధాలు పెరుగుతాయన్నారు. అంతకుముందు


పోటీలకు హాజరైన క్రీడాకారులు

అతిథులు జాతీయ పతకాన్ని, స్పోర్ట్స్ ఫ్లాగ్‌ను ఆవిష్కరించారు. పాఠశాల బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఆకట్టుకున్నాయి. రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ మోహన్‌కుమార్, రిడ్జ్ సీఈఓ గోపీనాథ్, గ్లోబల్ స్కూల్ సీఈఓ జీవం శ్రీధర్, టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శి, డీన్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభం

టోర్నీ ప్రారంభ మ్యాచ్ అండర్-19 విభాగంలో హైదరాబాద్ డీపీఎస్ పాఠశాల, తిరుపతి పాఠశాల జట్టుపై 3-1 గోల్స్ తేడాతో గెలిచి శుభారంభం చేసింది. ఇదే విభాగంలో చిన్మయ విద్యాలయ (హైదరాబాద్), హార్ట్‌ఫుల్‌నెస్ లెర్నింగ్ సెంటర్ (తెలంగాణ), కాకతీయ పబ్లిక్ స్కూల్ (విశాఖపట్నం), ఇండస్ యూనివర్సల్ స్కూల్ (హైదరాబాద్) జట్లు గెలుపొందాయి.

జాతీయ క్రీడాకారుడికి సన్మానం


కురువ మధును సన్మానిస్తున్న సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): చైనా దేశంలోని కింగ్‌డావోలో ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు జరిగిన ఆసియా బీచ్ సెపక్‌తక్రా పోటీల్లో భారత జట్టు కాంస్య పతకం సాధించగా జట్టు తరఫున ఉత్తమంగా రాణించిన ఆలూరుకు చెందిన క్రీడాకారుడు కురువ మధును ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక బీరప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా కురువ సంఘం నాయకులు క్రీడాకారుడు మధుకు శాలువా కప్పి జ్ఞాపిక, రూ.5 వేలను పారితోషికంగా అందించారు. సంఘం అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, మాజీ అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలీల, కే అనిత పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. నాయకులు దేవేంద్ర, ధనుంజయ, బీసీ తిరుపాల్, సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కినేని పురస్కారాల ప్రదానం


అక్కినేని పురస్కారాలు అందుకున్న వారితో అతిథులు, కళాక్షేత్రం సభ్యులు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో స్థానిక సీక్యాంప్ కళాక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ముగింపు వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చాటిన వ్యక్తులు, సమాజ సేవకులకు అవార్డుల ప్రదానం చేశారు. ప్రతిభా విద్యాసంస్థల అధినేత ఎం.అరుణాచల రెడ్డి, గజల్స్ గాయకుడు, ప్రధానోపాధ్యాయులు ఎస్.మహమ్మద్ మియ్యా, విశ్రాంత మండల విద్యాధికారి పి.రాజారత్నం, నాట్యాచార్యులు రామకృష్ణ, హాస్య నటులు, విశ్రాంత ఉద్యోగి సంగా ఆంజనేయులు, లలిత కళా సమితి మాజీ అధ్యక్షుడు, విశ్రాంత అధ్యాపకులు పి.దస్తగిరి, కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.వి.రమణారెడ్డి, రచయిత, ఉపాధ్యాయుడు ఎస్.ఎం.డి.ఇనాయతుల్లాకు అక్కినేని పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల నటనా ప్రస్థానం ఎవరూ మరిచి పోలేరన్నారు. కర్నూలు నగర పాలక సంస్థ మేనేజర్ చిన్న రాముడు మాట్లాడారు. అనంతరం వాతావరణ కాలుష్యం వల్ల కలిగే అనర్థాలపై విజయవాడ వెలగలేరు ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'రాత' నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. కళాక్షేత్రం తరపున కళాకారులకు రూ.20 వేల పారితోషికాన్ని అందజేశారు. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, సభ్యులు పాల్గొన్నారు.

దాడి చేసిన టీడీపీ నాయకుడిపై కేసు నమోదు


బాధితుడు శేషశయన ఆచారి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న రూరల్ సీఐ రాకేష్

డోన్: ఎమ్మెల్యే కోట్ల ప్రధాన అనుచరుడు టీడీపీ నాయకుడు ఓబులాపురం శేషిరెడ్డిపై కేసు నమోదైంది. రూరల్ పోలీసుస్టేషన్ ఆవరణలో సివిల్ పంచాయితీ విషయంపై పోలీసుల సమక్షంలో డోన్ మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన శేషశయన ఆచారిపై శేషిరెడ్డిపై దాడిచేశాడు. ఈ ఘటనపై.. ఏఎస్‌ఐ సమక్షంలోనే టీడీపీ నేత దాడి శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనంపై ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా స్పందించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో శ్రద్ధ తీసుకోకుండా సివిల్ పంచాయితీల్లో తలదూర్చడం ఏమిటని స్థానిక పోలీసు అధికారులను మందలించినట్లు సమాచారం. దీంతో బాధితుడు శేషశయన ఆచారి ఫిర్యాదుతో టీడీపీ నాయకుడు శేషిరెడ్డిపై తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు కేసు నమోదుచేశారు.

మెప్మాలో బదిలీలు

కర్నూలు (టౌన్): జిల్లాలోని మున్సిపాల్టీల పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేసింది. కర్నూలు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో పనిచేసే జి. జిలానీబాషాను ఆదోని మున్సిపాల్టీకి, ఆదోని మున్సిపాల్టీలో పనిచేసే ఎం.వీరారెడ్డిని కర్నూలుకు, అలాగే గూడూరులో పనిచేసే ఎన్. సూర్యనారాయణను బేతంచెర్లకు, కర్నూలులో సీఎంఎంగా పనిచేస్తున్న జి.మురళీని నంద్యాలకు, అక్కడ పనిచేసే విజయభాస్కర్ రెడ్డిని కర్నూలుకు బదిలీ చేశారు.

కర్నూలు కార్పొరేషన్‌లో..

కర్నూలు నగరపాలక సంస్థలోని మెప్మాలో పనిచేసే కమ్యూనిటీ ఆర్గనైజర్లు షేక్ ఫాతిమాబీ నంద్యాలకు, జి.రవికుమారిని నంద్యాల మున్సిపాల్టీ, ఎస్.వెంగ లక్ష్మీని నంద్యాలకు, ఏ.రియాజ్‌బాషా ఎమ్మిగనూరు మున్సిపాల్టీకి, బండ నాగేష్‌ను డోన్ మున్సిపాల్టీకి, చాకలి అశోక్‌కుమార్‌ను ఎమ్మిగనూరుకు, జావీద్ హుస్సేన్‌ను ఆదోని మున్సిపాల్టీకి, హిమబిందును ఆళ్లగడ్డకు బదిలీ చేస్తూ ఆదివారం నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

మెప్మాలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల బదిలీ

నంద్యాల మెప్మాలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాసులును కర్నూలుకు, కర్నూలులో పనిచేస్తున్న ఎన్.గఫార్ ఖాన్‌ను ఎమ్మిగనూరు మున్సిపాల్టీకి, కర్నూలులో పనిచేసే ఎస్.షకీరాను నంద్యాల మున్సిపాల్టీకి, ఎమ్మిగనూరు మున్సిపాల్టీలో పనిచేసే కె.ప్రదీప్‌ను కర్నూలుకు బదిలీ చేస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఘనంగా గంధం వేడుకలు


దర్గాలో స్వామి వారి సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గా ఉరుసులో భాగంగా ఆదివారం రాత్రి గంధం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే గాక పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామివారి సమాధులను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి మొదలైన గంధం ఊరేగింపు సోమవారం తెల్లవారుజాము వరకు గ్రామ పురవీధుల గుండా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు కర్రసాము తదితర విన్యాసాలను ప్రదర్శించారు. ఆ తర్వాత గంధం దర్గాలకు చేరడంతో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేశారు. సోమవారం ఉరుసు, మంగళవారం జియారత్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించినట్లు గ్రామ సర్పంచ్ కురువ చాముండేశ్వరి, దర్గాల నిర్వాహకులు తెలిపారు. ఉరుసులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఆలూరు సీఐ శ్రీనివాసనాయక్, హొళగుంద ఎస్ఐ బాలనరసింహులు బందోబస్తు నిర్వహించారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

- క్లస్టర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్


సమావేశంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

కర్నూలు(సెంట్రల్): జాతీయ విద్యా విధానం -2020ని రద్దు చేసి, దాని స్థానంలో ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని అమలు చేయాలని క్లస్టర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాలలో ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రారంభ ఉపన్యాసకులుగా సాయి గోపాల్ మాట్లాడుతూ..దేశంలో విద్యా విధానంలో మార్పులు చేసే సమయంలో విద్యా రంగానికి సంబంధించి కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. నూతన విద్యావిధానం-2020 సమయంలో ఇలా జరగలేదన్నారు. దీంతోనే భిన్నాభిప్రాయాలు వస్తున్నాయన్నారు. మానవ హక్కుల ఉద్యమ నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ..చదువు పరమార్థం సంపాదన కోసమే అన్నట్లు నూతన విద్యా విధానం ఉందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటేష్ మాట్లాడుతూ.. విద్యా హక్కుచట్టం ప్రకారం ఇంటర్మీడియట్ విద్యను స్కూలు ఎడ్యుకేషన్‌లో విలీనం చేయడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఏఐఎస్ఈసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎన్ రాజశేఖర్ మాట్లాడుతూ..కర్నాటకలో నాలుగేళ్ల డిగ్రీకి వ్యతిరేకంగా లక్షల సంఖ్యలో సంతకాల సేకరణ చేయడంతో మూడేళ్ల డిగ్రీనే ఆ రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. నాలుగేళ్ల డిగ్రీ అనేది అదనపు సంవత్సరం భారం తప్ప ఇంకేమి కాదన్నారు. ఏఐఎస్ఈసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.గోవిందరాజు మాట్లాడుతూ..రాష్ట్రంలో ఎన్ఈపీ-2020 అమలు ద్వారా బోధన-అభ్యసన ప్రక్రియ పూర్తిగా ధ్వంసమైందన్నారు. అనంతరం సదస్సులో నాలుగేళ్ల డిగ్రీ, నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. అంతేకాక ఎన్ఈపీ-2020కి ప్రత్యామ్నాయ ప్రజా విద్యా విధానం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఈసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు టి.వెంకటరెడ్డి, కార్యదర్శి వి.హరీసకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన పెరగాలి



గుండె జబ్బులపై అవగాహన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు

కర్నూలు(హాస్పిటల్): గుండె జబ్బులపై ప్రజలు అవగాహన పెంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ.. వాతావరణంలో కాలుష్యం పెరగడం వల్ల వ్యాధులు రెట్టింపవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండటం, వ్యాయామం చేయడం, ఊబకాయాన్ని తగ్గించుకోవడం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం చేయడం చేయాలన్నారు. తిరుపతికి చెందిన డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చిన వారిలో చికిత్స తీసుకున్నా కేవలం 70 శాతం మాత్రమే సుదీర్ఘకాలం జీవించగలుగుతున్నారని తెలిపారు. ఎక్కువ సేపు కూర్చుని ఉండటం, వంశపారంపర్యం, మానసిక ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారం, పొగాకు, మద్యపానం చేసేవారికి గుండె పోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని చెప్పారు. అంతకుముందు ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో నిర్వహించిన సీఎంఈలోనూ ఆయన గుండెజబ్బుల గురించి వివరించారు. అనంతపురానికి చెందిన డాక్టర్ హరిప్రసాద్ నిర్వహించిన హాస్యవల్లరి, గాన లహరి కార్యక్రమాలు అలరించాయి. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, రిటైర్డ్ కలెక్టర్ రామశంకర్‌నాయక్, రిటైర్డ్ రేడియో వ్యాఖ్యాత పోతన తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో ప్రముఖులు


సీబీఐసీ చైర్మన్ సంజయ్‌కుమార్ అగర్వాల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్‌స్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) చైర్మన్ సంజయ్‌కుమార్ అగర్వాల్ ఆదివారం కుటుంబ సమేతంగా మల్లన్నను దర్శించుకుని పూజలు చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ కార్యదర్శి దేవేశ్ చతుర్వేది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వేర్వేరు సమయాల్లో వీరు మల్లన్న దర్శనానికి ఆలయం వద్దకు రాగా ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, పీఆర్వో టి.శ్రీనివాసరావు స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేదపండితులు వేదమంత్రాలు పలకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు.

విజిలెన్స్‌కు కర్నూలు ఏఓ

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో కర్నూలు మండల అధికారిగా పనిచేస్తున్న ఎస్.విశ్వనాథ్ డెప్యుటేషన్‌పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు వెళ్లారు. ఆత్మకూరుకు చెందిన ఈయన 2018 డిసెంబరు నుంచి కర్నూలు మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది సాధారణ బదిలీల్లో ఈయన బదిలీ కావాల్సి ఉన్నప్పటికీ వ్యవసాయ అనుబంధ శాఖలకు మినహాయింపు ఇవ్వడంతో అదే స్థానంలో కొనసాగారు. కొద్ది నెలలుగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఓగా వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తుండగా ఎట్టకేలకు ఫలించాయి. విజిలెన్స్ శాఖ నుంచి ఆమోదం లభించగా, వ్యవసాయ శాఖ కూడా అక్కడికి పంపేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో విశ్వనాథ్ కర్నూలు ఏఓ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలతో మధుమతిని ఏఓగా నియమిస్తూ జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. రిలీవ్ అయిన ఏఓ విశ్వనాథ్ విజిలెన్స్ హెడ్ క్వార్టర్స్‌లో ఒకటి, రెండు రోజుల్లో రిపోర్టు చేసుకోనున్నారు. తర్వాత ఆయన్ను కర్నూలు విజిలెన్స్ ఏఓగా నియమించే అవకాశం ఉంది.

కాసుల ట'మోట'

- 25 కిలోల బాక్స్ ధర రూ.1200 పైనే
- రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.60పైనే
- అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అధిక వర్షాలతో దెబ్బతిన్న పైరు
- దేశంలోని వివిధ ప్రాంతాలకు కర్నూలు టమాట
- ఉమ్మడి జిల్లాలో 10 వేల ఎకరాల్లో సాగు


ఆస్పరి మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన టమాట

కర్నూలు(అగ్రికల్చర్): టమాట ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. ఈ ధరలు రైతులకు ఆనందాన్నిస్తుండగా వినియోగదారులు మాత్రం బెంబేలెత్తిపోతున్నారు. ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టమాట ప్రధానంగా ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఎక్కువగా సాగవుతుంది. ఈ ఏడాది ఆగస్టులో కురిసిన అధిక వర్షాల వల్ల ఉమ్మడి అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో టమాట పైరు దెబ్బతినింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆగస్టులో టమాట పండించే ప్రాంతాలైన ప్యాపిలి, డోన్, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ, మద్దికెర, పెద్దకడబూరు, హాలహర్వి, హొళగుంద, ఓర్వకల్, కల్లూరు, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల్లో వర్షాల తీవ్రత అంతగా లేదు. ఇందువల్ల టమాటపై అధిక వర్షాల ప్రభావం లేదు. చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో టమాట పంట దెబ్బతినడం వల్ల ఉమ్మడి కర్నూలు జిల్లాలో పండించిన టమాటకు డిమాండ్ పెరిగింది. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 10 వేల ఎకరాల్లో టమాట సాగయ్యింది. ధరలు జోరు మీద ఉండటంతో రబీలో కూడా సాగు చేస్తున్నారు. గతేడాది సెప్టెంబరులో టమాట ధరలు అతి తక్కువగా ఉన్నాయి. 25 కిలోల బాక్స్ ధర రూ.100 నుంచి రూ.200 వరకు మాత్రమే ఉంది. రిటైల్‌గా మార్కెట్‌లో కిలో ధర రూ.6 నుంచి రూ.10 వరకు మాత్రమే ఉంది. ఈ సారి ఆగస్టులో కురిసిన అధిక వర్షాలకు వివిధ జిల్లాలోల్ పంటలు దెబ్బతినడం వల్ల ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులకు కలిసివచ్చింది. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 600 టన్నుల వరకు టమాట దిగుబడి వస్తోంది. 25 కిలోల బాక్స్ ధర నాణ్యతను బట్టి రూ.1200 నుంచి రూ.1400 వరకు పలుకుతోంది. ప్యాపిలి, డోన్, ఆస్పరి, పత్తికొండ, దేవనకొండ, డోన్ తదితర ప్రాంతాల్లో పండించిన టమాట హైదరాబాద్, విజయవాడ, ఉభయ గోదావరి జిల్లాలు, ఢిల్లీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు పెద్ద ఎత్తున తరలుతోంది. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పత్తికొండ, కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో టమాట కొనుగోళ్లు జరుగుతున్నాయి. వివిధ మండలాల్లో ప్రయివేటు టమాట మార్కెట్లు కూడా ఉన్నాయి. టమాట ధరలు రోజురోజుకు పెరుగుతుండడం, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తుండడంతో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డుకు టమాట 74.25 టన్నులు వచ్చింది. క్వింటాలు కనిష్ట ధర రూ.2600 ఉండగా.. గరిష్ట ధర రూ.4500 లభించింది. సగటు ధర క్వింటాలుకు రూ.3200 నమోదు అయ్యింది. టమాట ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రిటైల్ మార్కెట్‌లో టమాట ధర మండుతోంది. కర్నూలులోని రైతుబజార్లలో కిలో ధర రూ.30/44 ఉండగా బయట రూ.రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు.